# దగ్గరగా

ఎప్పుడో చాలా ఏళ్ల క్రితం...

వాళ్లిద్దరు రోజూ రెండు మైళ్లు నడిచి స్కూల్‌కి వెళ్లేవారు. గోపీకి ఎనిమిదేళ్లు, లక్ష్మికి ఆరేళ్లు. కాలవగట్టమ్మట ఒకరి చేతిని మరొకరు పట్టుకుని జాగ్రత్తగా నడిచేవారు. వెనకనుంచి బస్సొచ్చినా ముందునుంచి ఎడ్లబండి వెళ్లినా, ఒకరికొకరు తోడు... ధైర్యం...

×××

ఆ మధ్య కొన్నేళ్లక్రితం...

వెంకట్రావుకి, వనజకి పెళ్లయిన కొత్త... పదహారు రోజుల పండగ జరిగిన ఉద్విగ్న యవ్వనం... ఎక్కడికెళ్లినా, ఎలా నడిచినా, ఏ మాత్రం వీలు దొరికినా, ఒకరిచేతిలో మరొకరి చెయ్యి. ఆ స్పర్శా, దగ్గరితనం యిద్దరికీ కొత్తగా ఎంతకీ తనివి తీరనట్టు... రాత్రీ, పగలూ అద్భుతంగా వెలుగుతున్నట్టు...

×××

ఈ మధ్య...

పరంధామయ్యగారు, లలితగారూ, గబగబా నడవలేకపోతున్నారు. డెబ్భైఎనిమిదేళ్ల ఆయన డెబ్భై రెండేళ్ల ఆవిడా... అరఫర్లాంగైనా సరే యిద్దరూ కలిసే వెడుతున్నారు. ఒకరి పక్కగా మరొకరో, లేదా ఒకరి వెనుకగా మరొకరో... ఏ మాత్రం వీలున్నా ఒకరి చెయ్యి మరొకరువదలరు. నడుస్తూ, నడుస్తూ... ఒక్కో క్షణం యిద్దరూ ఒకరిచేతిని మరొకరు మరింత గట్టిగా... మరింత బలంగా పట్టుకుంటారు... జీవితం తాలూకు మొత్తం సారమంతా ఆ స్పర్శలోనే వున్నట్టు... జీవితం సాగటానికి, అన్ని రకాల భయాలూ ధైర్యంగా మారటానికి యిద్దరి చేరువ చాలన్నట్టు...

– ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక 23-12-2000